విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 9, జూన్ 2024

'అనంత' అభివృద్ధికి అధికారులు సహకరించాలి

- వరదల కట్టడికి 72 గంటల్లోగా కార్యాచరణ తయారు చేయాలి..
- వంకల్లో తక్షణమే చెత్త తొలగింపు చర్యలు చేపట్టండి..
- శానిటేషన్ చర్యలు పక్కాగా తీసుకోండి
- ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించండి
- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర-అనంతపురం : అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయా శాఖల అధికారులు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కోరారు. శనివారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నగరపాలక సంస్థ పరిధిలోని అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నిర్వహణలో భాగంగా భారీ వర్షం వచ్చి ఎక్కువ నీరు వస్తే ఎక్కడ నుంచి ఎక్కడికి పోతుంది.. ఎక్కడ ప్రభావితం అవుతుంది అనే దానిపై వచ్చే 72 గంటల్లోగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. నగరంలోని నడిమివంక, మరువవంకలు, డ్రైనేజీ వ్యవస్థపై నగరపాలక సంస్థ కమిషనర్ సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్డి, ఎస్ఈ, టౌన్ ప్లానర్, డిపిఓ, తహసిల్దార్ భాగస్వామ్యం కావాలన్నారు. నడిమివంక, మరువవంకలు వెళ్లే ప్రాంతంపై పరిశీలించి, ఎక్కడా చెత్త ఉండేందుకు వీలు లేకుండా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా వంకలలో చెత్త తొలగించేందుకు పలుచోట్ల మట్టివేసి దారి ఏర్పాటు చేయాలన్నారు. నగరపాలక సంస్థ చుట్టూ ఉన్న పంచాయతీలతో సమన్వయం చేసుకొని అధికారులు పని చేయాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో కూడా డ్రైవ్ ద్వారా డ్రైనేజీలను పరిశీలన చేయాలన్నారు. ఆల్ ఇండియా రేడియోలో మున్సిపల్ కమిషనర్ ఫోన్ఇన్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. వర్షాకాలం సీజన్ నేపథ్యంలో మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ ఫాగింగ్ చేయించాలన్నారు. ఫాగింగ్ చేయడం చేపట్టారా లేదా అనేది శానిటేషన్ సెక్రటరీ ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని, ఈ విషయమై కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేయాలన్నారు. కీలక ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐఈసి మెటీరియల్‌ను ప్రదర్శించాలన్నారు. నీటి నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రేయింగ్ చేయించాలని, జూలై, ఆగస్టు నుంచి మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని, ఇందుకోసం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో వీధి దీపాలు ఎక్కడైనా పని చేయకపోతే వాటిని పనిచేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గుపాటి ప్రసాద్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు. నగరంలోని నడిమివంక, మరువవంక అక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని నడిమివంక, మరువవంక వెళ్లే ప్రాంతాల్లో పలుచోట్ల ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయిందని, నగరంలో ఆ వంకలు మూడు కిలోమీటర్ల మేర వెళ్తుండగా, భారీ వర్షాలు వల్ల వరదలు వచ్చినప్పుడు వంకలు బ్లాక్ అయి నీరు పైకి వచ్చి కాలనీలలోకి చేరుతున్నాయన్నారు. ఆయా వంకలపై కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో మున్సిపాలిటీల తరఫున లక్ష మొక్కలను నాటించి వాటిని సంరక్షించాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ పివిఎస్ఎన్ మూర్తి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, పబ్లిక్ హెల్త్ డిఎస్ఈ రామ్మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ లింగమయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన మదరసా విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్



విశాలాంధ్ర-అనంతపురం: రాయదుర్గం పట్టణంలోని కనేకల్ రోడ్ లో ఉన్న జామియా మహమ్మదీయ అరేబియా కళాశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ శనివారం ఒక ప్రకటన ద్వారా కలెక్టర్ వినోద్ కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శుక్రవారం రాత్రి భోజనం చేసిన మదర్సా విద్యార్థులకు వాంతులు, విరేచనాలు జ్వరాలు రావడంతో గుర్తించిన సిబ్బంది ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ముందుగానే వర్షాలు వచ్చినాయి. సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కనుక జిల్లా కలెక్టర్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సిపిఐ జిల్లా సమితి తరుపున కోరుతున్నామన్నారు. నీటి వల్ల, ఆహారం వల్ల, వాంతులు విరేచనాలతో అడ్మిట్ అయిన మదరసా విద్యార్థులకు వెంటనే చికిత్స అందించడం ద్వారా కొందరు కళాశాలకు వెళ్లడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి నాణ్యమైన వైద్యం అందించి త్వరగా కోలుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి....

- కక్షలు, కార్పణ్యాలు వద్దు : సిఐ శ్రీధర్

విశాలాంధ్ర-శింగనమల : ప్రతిఒక్కరూ గ్రామాల్లో శాంతి యుత వాతావరణం నెలకొల్పే విధంగా సహకరించాలని చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకోకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలని సీఐ శ్రీధర్, నార్పల, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. నార్పల మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో మహిళా పోలీసులు, వీఆర్వోలు, మహిళా సంఘాల సభ్యులు, స్థానికులతో కలిపి శాంతి కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వీఆర్వోలు, మహిళా పోలీసులు మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు, గ్రామాల్లో గొడవలకు దిగడం ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి పాల్పడడం వంటివి చేయరాదని ప్రతిఒక్కరూ సమన్వ యంతో వ్యవహరించాలన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండల వ్యాప్తంగా ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరగడం ఒక మంచి శుభపరిణామమని అందుకు సహకరించిన అన్ని పార్టీల ప్రజాప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి..

విశాలాంధ్ర-రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని మహమ్మదీయా అరేబియా కళాశాలలో విద్యార్థులు 40 మందికి ఫుడ్ పాయిజన్ గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో భోజనం చేసిన తర్వాత మదరసా విద్యార్థులకు విరేచనాలు, జ్వరాలు రావడంతో కళాశాల ఉపాధ్యాయులు గుర్తించి రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు దీనిపైన విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకొని విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

స్టేట్ బ్యాంక్ ఏటీఎం ధ్వంసం

విశాలాంధ్ర-కూడేరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి ఎదురుగా ఉన్న ఏటీఎంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఏటీఎం మిషన్ ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించినట్లు బ్యాంకు అధికారులు పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఏటీఎం దగ్గరకు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైసీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ తలారి రంగయ్య

విశాలాంధ్ర-శెట్టూరు : మండల పరిధిలో చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరిజన లక్ష్మయ్య టీవీలో ఎన్నికల ఫలితాలు చూస్తుండగా గుండెపోటుతో కింద పడిపోవడంతో హాస్పిటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు, కళ్యాణ్‌దుర్గం నియోజకవర్గం సమన్వయకర్త డా.తలారి రంగయ్య శనివారం స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారికి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, సోమనాథ్రెడ్డి , సర్పంచ్ విరుపాక్షి, ఎమ్మెన్ రాయుడు, బోయ తిప్పేస్వామి, సింగల్ విండో డైరెక్టర్ గంగాధర పార్టీ నేతలు తదితరులు ఉన్నారు.

ధర్మవరం ఎమ్మెల్యేని కలిసిన బీజేపీ ఉరవకొండ నియోజకవర్గం ఇంచార్జ్ కొనకొండ్ల రాజేష్

విశాలాంధ్ర-కూడేరు: ఉరవకొండ నియోజకవర్గం ఇంచార్జ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ధర్మవరం ఎమ్మెల్యే వై సత్య కుమార్ ను, ఉరవకొండ నియోజకవర్గం భాజపా నాయకులు కూడేరు మండల నాయకులు ఎమ్మెల్యే సత్య కుమార్ గెలిచిన సందర్భంగా ఆయన ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ త్వరలో ఉరవకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే పయ్యావుల కేశవును కూడా కలవడం జరుగుతుందని, ఆయన గెలుపు కోసం ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని ఈ సందర్భంగా తెలియజేశారు.

ధర్మవరం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ రాష్ట్ర జిల్లా నాయకుల ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండలం ఇంచార్జిగా నన్ను నియమించడంతో పాటు, ఉరవకొండ నియోజకవర్గంలో కూడా ఎన్డీఏ కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలుపు కోసం కార్యకర్తలు బాగా కష్టపడ్డారని తెలిపారు. ఎమ్మెల్యేల గెలుపులో అందరి భాగస్వామ్యం ఉందని, పయ్యావుల కేశవ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఆనందించదగ్గ విషయం అన్నారు. ఎన్డీఏ కూటమి నాయకులకు ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అక్షర యోధుడు అస్తమించడం బాధాకరం

సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్



విశాలాంధ్ర-అనంతపురం: రామోజీరావు మృతి పై అనంత జిల్లా సమితి, సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ శనివారం సానుభూతిని వ్యక్తం చేశారు. ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు 88 సంవత్సరాలు కన్ను మూశారు అన్నారు. ఆయన పత్రికా రంగంలో ఎనలేని కృషి చేశారన్నారు. అక్షర యోధుడు అస్తమించడం చాలా బాధాకరం ఇంటి పేరును చెరుకూరి రామోజీరావు ఈనాడు రామోజీ రావుగా ప్రకటించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి సిపిఐ జిల్లా సమితి తరపున సానుభూతిని వ్యక్తం చేశారు.

మా కాలనీ అంటే ఎందుకంత వివక్ష !

- కాలువల నీరంతా ప్రధాన రహదారి పైనే ..
- అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి
- ప్రబలుతున్న వ్యాధులు
- కన్నెత్తి కూడా చూడని అధికారులు
- కల్లమడి గ్రామ కాలనీవాసుల ఆవేదన

విశాలాంధ్ర-శింగనమల : మండలంలోనిఇ కల్లమడి గ్రామం ఎస్సీ కాలనీలోకి పోవు ప్రధాన రహదారి పక్కన ముళ్ళచెట్లు పెరిగి రహదారిని కప్పి వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో రహదారం తటా మురికి నీరు నిరంతరం నిల్ల ఉండడంతో వృద్ధులు బురదలో నడవాల్సి వస్తోందని, చిన్నారులు కూడా పాఠశాలకు ఈ మార్గం గుండానే వెళ్లాల్సి వస్తోం దని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి నిల్వ కారణగా దోమలు అధికమై విషజ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలకు గురవుతున్నారని ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచా యతీ అధికారులు పట్టించుకోక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు శుభ్రపరచక పోవడంతో ఈ దుస్తితి నెలకొందన్నారు. గ్రామంలోని ఇతర మురికి కాలువల నీరంతా కూడా ఈ ప్రధాన రహదారిపైకి చేరుతుండ డంతో సమస్య జటిలంగా తయారైంది. మురుగునీరు బయటికి ప్రవహించేలా కాలువలు నిర్మించక పోవడం వల్లనే ఇంత దుస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగుతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, గ్రామస్థులు వాపోతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పత్రికా రారాజు రామోజీరావు సేవలు ఎనలేనివి

- పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

- పలువురు టీడీపీ నాయకుల ఘన నివాళులు

విశాలాంధ్ర-రాప్తాడు: మీడియా మొఘల్ రామోజీరావు సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే పరిటాల సునీత ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ కొనియాడారు. ఈనాడు దినపత్రిక ఫౌండర్ చైర్మన్ రామోజీరావు మృతి విషయాన్ని శనివారం ఉదయం తెలుసుకున్న వెంటనే ఫిలిం సిటీకి వెళ్లిన సునీత, శ్రీరామ్ వెళ్లారు. రామోజీరావు పార్థివ దేహం చూసి పరిటాల సునీత కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం రామోజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మా కుటుంబం ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని.. పరిటాల రవి హయాం నుంచి మాకు ఆయన ఎంతో అండగా ఉన్నారన్నారు. ఒక తండ్రిని కోల్పోయిన బాధ కలుగుతోందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థించారు.

అభ్యుదయ మార్గదర్శి రామోజీరావు ...

కాలమిస్ట్ నల్లాని రాజేశ్వరి

విశాలాంధ్ర-జెఎన్‌టీయూఏ: "ఈనాడు" సంస్థల ఛైర్మన్, రామోజీ గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు (88) మృతి అత్యంత బాధాకరమని ప్రముఖ కాలమిస్ట్, సామాజిక కార్యకర్త, ఎస్.ఆర్.ఐ. ఫౌండేషన్ ఛైర్ పర్సన్ నల్లాని రాజేశ్వరి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ అభ్యుదయ మార్గదర్శిగా చిరస్మరణీయుడిగా చరిత్రలో నిలుస్తారని కొనియాడారు. తాను వ్యక్తిగతంగా ఆయనను కలిసిన 2019 సెప్టెంబర్ 16వ తేదీ తన జీవితంలో మరచిపోలేని రోజన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని ఛైర్మన్ ఛాంబర్‌లో దాదాపు ఇరవై నిమిషాల పాటు జీవిత ప్రస్థానం గురించి పలు విషయాలు తెలియజేసి స్ఫూర్తినింపారన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాలికావిద్య, మహిళా సాధికారత వంటి అంశాలపై "ఈనాడు" దినపత్రికలో తాను రాసిన వ్యాసాల సంపుటి "సాధికారత" పుస్తకాన్ని ఆయనకు స్వయంగా అందజేయడం తన అదృష్టమన్నారు.

జర్నలిస్టులకు నైతిక విలువలు నేర్పిన మేధావి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: శనివారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు కంబదూరు, కళ్యాణదుర్గంలలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నివాళులు అర్పించారు. స్థానిక ప్రజా వేదిక ఆవరణంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు జర్నలిజానికి సరికొత్త నిర్వచనం చెబుతూ గ్రామ గ్రామానికి దినపత్రికలు తీసుకెళ్లిన అపర మేధావి రామోజీరావు అన్నారు. జర్నలిస్టులకు నైతిక విలువలు నేర్పించి సమాజాభివృద్ధిలో వారి పాత్రను గురించి తెలియజేసిన మహనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్ చౌదరి, ఆర్జి శివశంకర్, వైపి రమేష్, బిక్కి గోవిందప్ప, డిష్ మురళి, శ్రీనివాస్‌రెడ్డి గోల్ల వెంకటేశులు, మల్లిపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా రంగానికి వన్నె తెచ్చిన రామోజీ

విశాలాంధ్ర-రాప్తాడు: తెలుగు పత్రికా రంగానికి వన్నె తెచ్చిన ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా కొనియాడారు. ఈనాడు అధినేత శివైక్యం చెందడంతో రాప్తాడు టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పద్మవిభూషన్ సేవలు చిరస్మరణీయం ..

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: రామోజీరావుకు మండలంలోని ఉప్పర హలగేటు వద్ద మండల టీడీపీ కన్వీనర్ బలరాంరెడ్డి ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయ కులు మాట్లాడుతూ రామోజీరావు గత 50 సంవత్సరాల నుంచి ప్రజలకు విశేష సేవలు అందిస్తు ప్రజలకు సేవ చేశాడని వాటికి గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు వచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముల్లంగి నారాయణ స్వామి, ఎర్రగుంట్ల వెంకటేశులు, సొల్లాపురం బాబు, పయ్యావుల అనిల్, చలపతి, నవీన్, సైకిల్ షాప్ హనుమంతు, కృష్ణాపురం శ్రీనివాసులు, ఉద్దేహాళ్ శివ, సంగప్ప, రవిచంద్ర సాగర్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

తెలుగువారు గర్వించదగ్గ మహానేత

విశాలాంధ్ర-కణేకల్లు: అక్షర యోధుడు అనితర సాధ్యుడు ఈనాడు ఈటీవీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమించిన సందర్భంగా కనేకల్ మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తూ, తీవ్ర సంతాపం ప్రకటించారు. మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనందరాజు, మాట్లాడుతూ అతి సామాన్యుడిగా, ఈనాడు పత్రిక ఈటీవీ ఛానల్, మార్గదర్శి చిట్ ఫండ్స్, ప్రియా ఫుడ్స్ ఇలా అనేక సంస్థలను స్థాపించి ఉన్నత స్థాయికి ఎదిగి తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు రామోజీరావు అని కొనియాడారు. హైదరాబాదులో రామోజీరావు నిర్మించిన రామోజీ ఫిలిం సిటీ ప్రపంచ స్థాయి గుర్తింపు పొంది గిన్నిస్ బుక్ రికార్డుల్లో చోటు సంపాదించుకుందని తెలిపారు. పత్రికారంగంతో పాటు వివిధ సంస్థల్లో సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనను పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాంద్, రమేష్, మహబూబ్ సాబ్, నాగభూషణ, అనిల్ చౌదరి, జిలాన్, ముజ్జు, గోపాల్, తిప్పేస్వామి, షేక్ హుస్సేన్, రహిమాన్ ,లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 9 జూన్ 2024

బాలయ్య గెలుపుతో అంబరాన్నంటిన సంబరాలు

సంబరాల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు, అభిమానులు

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఇటీవల ముచ్చటగా మూడోసారి బాలయ్య హాట్రిక్ సాధించి 32597 ఓట్ల మెజారిటీ తో గెలుపొందడంతో హిందూపురం రూరల్ పరిధిలోని కిరికేర పంచాయతీ లో శనివారం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకొన్నారు. లేజెండ్ నందమూరి బాలకృష్ణ ఫాన్స్ కిరీకెర మాజీ సర్పంచ్ ఎస్.ఎన్.రాము ఆధ్వర్యంలో కిరీకెర నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ ఫ్లెక్సీ లను ఏర్పాటు చేసి పొట్టేలు దండాన్ని వేసి ఘనంగా ఉత్సవాలు జరుపుకొన్నారు. రాము మాట్లాడుతూ హిందూపురానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి మకాం వేసి ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిననూ చివరకు నియోజకవర్గ ప్రజలు నందమూరి బాలకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, హిందూపురం కూడా బాలకృష్ణ ఆధ్వర్యంలో అభివృద్ధి పరస్తారని తెలిపారు. గత ప్రభుత్వమైన జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో కరికెరా తెలుగుదేశం నాయకులు, లెజెండ్ బాలకృష్ణ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి..

ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ నిబంధనలో ను అటకెక్కించి విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పవన్, చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 1,42 ప్రతి పాఠశాలలో అమలుకు చర్యలు చేపట్టాలి అని, విద్యా పేరుతో కోట్ల వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు విద్య హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ, ప్రైవేట్, కార్పొరేట్ కాసులకు విద్యాశాఖ అధికారులు అమ్ముడుపోతు, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యను వ్యాపారం చేసిన ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు అనుమతి లేకుండా అక్రమ అడ్మిషన్ చేస్తున్న యాజమాన్యాలకు అమ్ముడుపోయిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠ్యపుస్తకాల అమ్మకానికి పెట్టిన ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న కార్పొరేట్ యాజమాన్యం విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునపే అడ్మిషన్స్ ఫుల్ అయ్యాయని చెప్పడం విదురం అన్నారు. ఫీజు నియంత్రణ చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అయ్యారని మండిపడ్డారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు పెంచాలంటే డిస్టిక్ ఫీ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలని , ఇష్టానుసారంగా 5000 నుండి 2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనిఫామ్స్, బుక్స్, ఇతర మెటీరియల్స్ విద్యాసంస్థలోనే అమ్మకానికి పెట్టినా ..పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు పై ఏఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. కావున వెంటనే విద్యాధికారులు ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేకపోతే దశలవారి పోరాటాలను రూపొందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్ రెడ్డి, నియోజవర్గ నాయకులు విజయ్ కుమార్, నరేష్, గణేష్, సాదిక్,నవీన్ తదితరులు పాల్గొన్నారు..

పార్టీ కోసం విశేష కృషి చేసిన తోట వాసుదేవకు టూవీలర్ అందజేత

విశాలాంధ్ర-ధర్మవరం: హిందూపురం బీజేపీ సోషల్ మీడియా పార్లమెంట్ కోఆర్డినేటర్ తోట వాసుదేవ పార్టీ కోసం చాలా కష్టపడి, విశేషంగా కృషి చేసిన వెంటనే తోట వాసుదేవకు సంద రాఘవ గుర్తించి తన వంతుగా హెూండా యాక్టివ్ టూ వీలర్‌ను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా తోట వాసుదేవా మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో తెలుగు దేశం పార్టీ బలోపేతం కోసం కష్టపడి తనవంతుగా కృషి చేశానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడటంలో నన్ను గుర్తించి సంద రాఘవ బ్రదర్స్ వారు నాకు టూవీలరును బహుమతిగా ఇవ్వడం మరిచిపోలేని, మరుపురాని రోజు అని తెలిపారు. తదుపరి సంధ్యా రాఘవ బ్రదర్సుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జగన్మోహన్ రెడ్డిని కలవకుండా సీఎంఓ అడ్డుపడింది..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం రైల్వే ఉపరితల వంతెన నిర్మాణ భూసేకరణపై తాను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అత్యవసరంగా కలవాలన్న నా తపనను సీఎంఓ అడ్డుపడిందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరంలో రైల్వే ఉపరితల వంతెన నిర్మాణ భూసేకరణకు 15 నుంచి 20 కోట్లు మంజూరు కోసం ముఖ్యమంత్రి కార్యాలయం చుట్టూ తిరగడం జరిగిందని, గుంతలు పడిన రోడ్ల నిధుల కోసం ఫైనాన్స్ కార్యదర్శి వద్దకు 50 సార్లు తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టో మీద తనకు నమ్మకం ఉండేదని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి సత్యకుమార్‌యాదవ్ తప్పక కృషి చేస్తారు..

- బీజేపీ నాయకుడు గిర్రాజు నగేష్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ తప్పక కృషిచేసి, ఇచ్చిన హామీ తప్పక అమలుపరుస్తారని బీజేపీ నాయకులు గిర్రాజు నగేష్ తెలిపారు. శనివారం ధర్మవరం 15 వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ, బొడ్రాయి వినాయకుని వద్ద 101 టెంకాయలను నాయకులు, కార్యకర్తలతో కలిసి కొట్టి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధి చెందకపోవడం ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కోవడం జరిగిందని, నేడు బీసీ అభ్యర్థి ఎమ్మెల్యేగా రావడంతో కష్టాలు తీరుతాయని స్పష్టం చేశారు. 15 వార్డులో సత్య కుమార్ యాదవుకు అత్యధిక ఓట్లు వేసి మెజార్టీతో గెలిపించిన సందర్భంగానే ఈ సంబరాలు జరుపుకుంటున్నామని, వార్డులోని అందరికీ ఇంటింటా స్వీట్లు పంపిణీ చేశామని చెప్పారు. రాబోయే కాలంలో సత్య కుమార్ యాదవును మంత్రిగా నియమించాలని సీఎంకు విన్నవించుకున్నారు. సత్యకుమార్‌యాదవ్ మంత్రి అయితే మరింత మెరుగుదలతో నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ విజయం ధర్మవరం ప్రజలదని చేశారు. ఈ కార్యక్రమంలో లాయర్ చంద్ర మౌళి, గిర్రాజు ప్రసాద్, మహేష్, కోటం రవి, సురేష్, శ్రీనివాసులు, భరత్ పాల్గొన్నారు.

ఇంటి పైన పని చేస్తూ జారిపడి కూలి దుర్మరణం..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శాంతినగర్ గ్యాస్ గౌడ వద్ద గల ఒక పాత ఇంటిని తొలగించే క్రమంలో ఇంటి పైకి ఎక్కి పనిచేస్తూ ఉండగా ప్రమాదవశాత్తు కాలు జారిపడి మండల పరిధిలోని దర్శనమల గ్రామానికి చెందిన పోతలయ్య (44) మృతి చెందాడు. పోతలయ్య కూలి పని చేసుకుంటూ మృతుడు పోతులయ్య తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇదే క్రమంలో పట్టణానికి వెళ్లి ఓ పాత ఇంటిని తొలగించే క్రమంలో జారిపడి మృతి చెందడం జరిగింది. గమనించిన తోటి కూలీలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం కు తరలించారు. తదుపరి అక్కడ కూడా పరిస్థితి విషమించడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లి చికిత్స చేయిస్తుండగా శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు బంధువులు కోరారు.

పేదలకు సేవ చేయడంలోనే తృప్తి

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు వైద్యం చేయ డంలోనే ఎంతో సంతృప్తి ఆనందం ఉందని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, ఉపాధ్యక్షులు సుకుమార్, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరం దాతగా కీర్తిశేషులు వెంకట లక్ష్మమ్మ, కీర్తిశేషులు చింత ఈశ్వరయ్య జ్ఞాపకార్థం వీరి కుమారుడు చింతా శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు వ్యవహరించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశా రు. ఈ శిబిరం యువర్ ఫౌండేషన్, నేత్రాలయ ఐ క్లినిక్ వారి ఆధ్వర్యంలో, పుష్పగిరి కంటి ఆసుపత్రి కడప వారిచే నిర్వహించడం జరిగిందని తెలిపారు. 146 మంది కంటి రోగులు రాగా అందులో 110 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన వీరందరికీ ఉచిత రవాణా ఖర్చులతో పాటు ఉచితంగా ఆపరేషన్, అద్దాలు కూడా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సహకార దర్శి నాగార్జున పిఆర్‌ఓ రాధాకృష్ణ డాక్టర్ సుబ్బారావు క్యాంపు చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, చాంద్ బాషా, స్టార్ ఖలీల్, గరే మహేష్ బాబు, బండ్లపల్లి రంగనాథ్, పోలా ప్రభాకర్, వైకె శ్రీనివాసులు, సత్రశాల మల్లికార్జున, ఓ వి. ప్రసాద్, నామాల శ్రీనివాసులు వాసుదేవుడు ఆప్తమాలజీ టెక్నీషియన్ నాగరాజా చారి కోఆర్డినేటర్ లక్ష్మణ్ ఆదిశేషు, టీకా సతీష్, రామచంద్ర గుప్తా, మామిళ్ళ ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నాట్య శిక్షణ శిబిరం..

డాన్స్ మాస్టర్ బాబు బాలాజీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లలిత నాట్య కళా నికేతన్ వారి వేసవి నాట్య శిక్షణ శిబిరం ముగింపు సంబరాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ బాబు బాలాజీ మాట్లాడుతూ మా సంస్థ నిర్వహించిన 45 రోజుల వేసవి నాట్య శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా 60 మంది విద్యార్థులచే భరతనాట్యము, కూచిపూడి, వివిధ రకాల జానపద నాట్యాలతో పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రదర్శన నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ మెడలు మెమెంటోళ్లు కూడా బహుకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు బాలాజీతో పాటు కమల బాంధవీ, రామ లాలిత్య, 60 మంది విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సవితమ్మకు మంత్రి రావాలని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

విశాలాంధ్ర- పెనుకొండ: మండల పరిధిలోని కురుబవాండ్లపల్లి గ్రామంలో టీడీపీ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఎర్రమంచి ఆంజనేయ స్వామికి ఎమ్మెల్యే సవితమ్మకు మంత్రి పదవి రావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుకొండ నియోజకవర్గం నుంచి బీసీ మహిళగా కురుబ కులంలో 175 నియోజకవర్గాలలో ఒక్కరే ఎమ్మెల్యేగా ఉన్నందున ఆమెకు టీడీపీ పార్టీ అధిష్టానం మంత్రి పదవి కేటాయించాలని దైవ సంకల్పం కావాలనే ఉద్దేశంతో విరివిగా పూజలు నిర్వహించామని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు.

పద్మ అవార్డు, టెన్సింగ్ నార్గే అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-పుట్టపర్తి : వివిధ రంగాల్లో ప్రతిభ, సేవలు అందించిన వారు పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి జిల్లా ఆల్ సెట్ జిల్లా యువజనుల సర్వీస్ శాఖ సీఈవో కరుణ కుమారి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ భారత హెూం మంత్రిత్వ శాఖ వారు 2025 రిపబ్లిక్ డే సందర్భంగా ఎంపికైన వారికి పద్మ అవార్డులు అందజేస్తారన్నారు. కళలు, సాహిత్యం మరియు విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక, సాంఘికంగా అందించిన సేవలు సైన్స్ మరియు ఇంజనీరింగ్, ప్రజా సంబంధాల సివిల్ సర్వీస్, ట్రేడ్ మరియు ఇండస్ట్రీ తదితర రంగాలలో ఉత్తమ సేవలు కనబరిచిన వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే టెన్సింగ్ నార్గే జాతీయ అవార్డులకు కూడా ప్రతిభ కలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2021, 22, 23 సంవత్సరాలలో భూమి నీరు (సముద్రం) గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాలలో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి రాష్ట్రపతి చేతులు మీదుగా టెన్సింగ్ నార్గే కాంస్య విగ్రహంతో ప్రశంస పత్రాలు, 15 లక్షల నగదు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 14లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలన్నారు.

నేషనల్ మీన్స్ పరీక్షల్లో సత్తా చాటిన మోదా విద్యార్థులు

విశాలాంధ్ర-పరిగి: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్, మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో పరిగి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన మోద విద్యార్థులు భాను తేజ అభిలాష్ 110, 108 మార్కులు సాధించి ఈ స్కాలర్షిప్ కి ఎంపిక అయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాలు ఇవ్వడం జరుగుతుంది. వీరికి శిక్షణ ఇచ్చినటువంటి ఉపాధ్యాయులు రాజశేఖర్, రమారెడ్డిని ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ మీన్స్, మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో తమ విద్యార్థులు ఉత్తీర్ణులై స్కాలర్షిప్ కు అర్హత పొందడం తమ పాఠశాలకే గర్వకారణం అన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకుల వితరణ..

వృద్ధులకు సరుకులు అందిస్తున్న దాతలు

విశాలాంధ్ర-అమడగూరు : మండల కేంద్రంలోని శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమంలో గోరంట్ల మండలానికి చెందిన రూప, రాజు ల కుమార్తె కావ్య, తల్లి రూప ఇరువురి పుట్టినరోజు సందర్భంగా శనివారం వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణ జ్యోతి కుమార్తె గీత కు నిత్యవసర సరుకులను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి, కూతురు ఇరువురి పుట్టినరోజు ఒకేరోజు కావడం, మా పుట్టినరోజును ఆశ్రమంలోని వృద్ధుల నడుమ చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఈ వృద్ధాశ్రమానికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. అనంతరం వృద్ధులు రూప కావ్యాలను నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శశిధర్, సున్నంపల్లి నరసింహులు, ఆశ్రమంలోని వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర మరచిపోలేని వ్యక్తి రామోజీరావు

▶ టీడీపీ నాయకుల కితాబు..

▶ ఘనంగా నివాళులు

విశాలాంధ్ర-ధర్మవరం: చరిత్ర మరిచిపోలేని వ్యక్తి రామోజీరావు అని టిడిపి నాయకులు కమతం కాటమయ్య ,పరిసే సుధాకర్, మహేష్ చౌదరి, పురుషోత్తం గౌడ్, చిగిచెర్ల ఓబిరెడ్డి, భీమనేని ప్రసాద్ నాయుడు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావు మృతి పట్ల సంతాప సభను ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ రామోజీరావు అంచలంచలుగా ఎదిగి ఎంతోమంది జీవితాలలో వెలుగు నింపిన మహనీయుడు అన్నారు. తెలుగు పాఠకులకు సినీ రంగానికి, వారి మృతి తీరని లోటు అని తెలిపారు. తొలుత ఆయన మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం వహించి, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. జర్నలిజంలో ఆయన కలం పట్టుకుంటే తిరుగు లేదని ఎంతోమంది ఆయనను బెదిరించిన అదరని, బెదరని అనివ్యక్తి అని తెలిపారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఒక అక్షర యోధుడిగా పోరాటం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు అని తెలిపారు.

తెలుగు జాతికి తీరని లోటు

విశాలాంధ్ర-ధర్మవరం: అభ్యుదయ మార్గదర్శి, ఈనాడు పత్రిక సంస్థ చైర్మన్, రామోజీ గ్రూపు సంస్థల అధినేత, పద్మ విభీషణ్ చెరుకూరి రామోజీరావు (88) మృతి తెలుగు జాతికి తీరని లోటు అని, ఓ మంచి వ్యక్తిని పత్రికారంగం సినీ రంగం కోల్పోవడం నిజంగా బాధాకరమని చేనేత జాతీయ సభ్యురాలు సంకారపు జయశ్రీ, రిటైర్డ్ కంటి అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంకారపు నరసింహులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హెూం లో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సంతాప సభ పాత్రికేయులతో పాటు జయశ్రీ డాక్టర్ నరసింహులు ఆధ్వర్యంలో జరిగాయి. తొలుత రామోజీరావు చిత్రపటానికి అందరూ పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం వహించారు. అనంతరం జయశ్రీ, డాక్టర్ నరసింహులు దంపతులు మాట్లాడుతూ రామోజీరావుతో తమకున్న పరిచయాలను గుర్తు చేసుకున్నారు. మద్యపాన నిషేద ఉద్యమంలో మూడేళ్లు వారితో పాటు పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. జర్నలిజం సంస్థలు స్థాపించి వేలాదిమందికి ఉపాధి కల్పించి, ఇతర వ్యాపార సంస్థలు సినీ పరిశ్రమ మార్గదర్శి, ఈనాడు టీవీలలో ఉపాధి కల్పించడం ఆయనకు ఆయనే సాటి అన్నారు. వారి ఆశయ సాధనాల కోసం పాత్రికేయులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రముఖ కాలమిస్ట్ సామాజిక కార్యకర్త రామోజీ ఎందరికో ఆదర్శవైనారని తెలిపారు. దేశస్థాయిలో రామోజీ ఫిలిం సిటీ అందరికీ ఆదర్శమైందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా రామోజీ పట్ల వారు చేసిన కృషి పట్ల ఆనాడే మంచి గుర్తింపు రావడం జరిగిందన్నారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనప్పటికీ లెక్కచేయకుండా, ఒక లక్ష్యంతో, పట్టుదలతో, ఉన్నత స్థానానికి చేరుకొని, తన సంస్థలను అత్యున్నత శిఖరాల్లో అగ్రగామిగా నిలబెట్టిన మహా వ్యక్తి రామోజీ రావే అని తెలిపారు. అకుంఠిత దీక్షితో, నీతి, నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాలని కోరారు. అధిక సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు రామోజీరావు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ఈనాడు పత్రిక, ఈటీవీ అధినేత చెరుకూరి రామోజీరావు మరణం తీరనిలోటని టిడిపి మండల కన్వీనర్ ఏ ప్రభాకర్ నాయుడు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ముదిగుబ్బలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రామోజీరావు సంతాప సభ కార్యక్రమంలో వారు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామోజీరావు 1962లో పత్రికా రంగం లో ప్రవేశించి మొదట కంట్రిబ్యూటర్‌గా పనిచేసి అనంతరం అన్నదాత మాస పత్రిక ప్రారంభించి తదనంతరం 1974లో టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చేతుల మీదుగా విజయవాడలో ఈనాడు పత్రికను స్థాపించడం జరిగిందన్నారు. అప్పట్నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా ఈనాడు పత్రిక తనదైన శైలిలో దూసుకుపోతూ పత్రిక రంగంలోనే రామోజీరావు తనదైన ముద్ర వేశారన్నారు. అదేవిధంగా ఈటివి స్టూడియో స్థాపించి అంతర్జాతీయ స్థాయిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక స్థానం తెచ్చారన్నారు. పారిశ్రామిక వేత్తగా ఎన్నో లక్షల మందికి ఉపాధి చూపించిన రామోజీరావు నేడు మన మధ్య లేకపోవడం మన దురదృష్టకరమని విచారణ వ్యక్తం చేశారు.

తెలుగు సమాజానికి తీరనిలోటు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ టీడీపీ కార్యాలయంలో శనివారం అక్షర యోధుడు సినీ నిర్మాత,రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి తెలుగుదేశం పార్టీ నాయకులు నివాళులర్పించారు శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ తెలుగు సమాజానికి తీరని లోటు. ప్రజా పక్షపాతి, అలుపెరుగని అక్షర యోధుడు, జనహితమే తన అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన రామోజీరావు మరణించడం బాధాకరం అంటూ తమ యొక్క సంతాపాన్ని తెలియజేస్తూ ఆయన

సమాజానికి చేసిన సేవలు గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాలను వెలుగులోకి తెచ్చిన యోధుడు

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుసుకున్నఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విజయవాడలో టిడిపి కేంద్ర కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ పత్రికా రంగంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా రామోజీరావు నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెచ్చారన్నారు. ఆయన వ్యాపార రంగంలో సినీ రంగంలో రాణించడమే గాక పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. పుట్టపర్తిలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో హనుమన్ సర్కిల్‌లో రామోజీకి ఘనంగా నివాళులర్పించారు. రామోజీ మీడియాలో తనదైన శైలిలో పాఠకుల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రవి, దేవానంద రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి, కేశవ నాయుడు, అమ్మినేని సూరి, ముమ్మనేని గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి యువ నాయకులు రామ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రామోజీకి ఘన నివాళులు అర్పించి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.

కలమెత్తిన మహానుభావుడు

విశాలాంధ్ర-కొత్తచెరువు : ఈనాడు పత్రిక వ్యవస్థాపకులు రామోజీరావు అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొత్త చెరువులోనే ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనాడు పత్రిక వ్యవస్థాపకుడిగా ఎనలేని సేవలు అందించారన్నారు. పత్రిక ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, శివా, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు వంశీ కిషోర్ ,నాని ,వెంకటేశు , చంద్ర పాల్గొన్నారు.

తెలుగు భాష కోవిదుడు

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలోని ప్రెస్క్లబ్ నందు రామోజీరావు మృతి పట్ల విలేకరులు శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల చేసి నివాళులు అర్పించారు. విలేకరులు మాట్లాడుతూ, తెలుగు భాష కోవిదుడు, సంగీత సాహిత్య కళాపోషకుడు, ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం విలేకరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం

విశాలాంధ్ర -అగళి : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్టిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ముసుగు వేసిన విషయం తెలిసిందే. రెండు నెలలుగా కొనసాగిన ఎన్నికలు కోడ్ ఎత్తివేయడంతో విగ్రహాలకు వేసిన ముసుగును శనివారం జడ్పీటీసీ ఉమేష్ మండల కన్వీనర్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బిజెపి నాయకులతో కలిసి టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తొలగించి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి టిడిపి ఎమ్మెల్యేను గెలిపించి అసెంబ్లీకి పంపించినందుకు అగళి మండల ప్రజలందరికీ రుణపడి ఉంటామని, ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని కృతజ్ఞతలు తెలిపారు. అక్షర శిల్పి రామోజీరావు అనారోగ్యంతో మృతి చెందడం తెలుగు సమాజానికి తీరని లోటని తెలిపారు. జడ్పిటిసి ఉమేష్ కన్వీనర్ కుమారస్వామి వాల్మీకి పుట్ట బొమ్మసానిపల్లి లింగరాజు మధూడి రంగనాథ్ మాజీ కన్వీనర్ షౌకత్ అలీ ఖాన్ సీనియర్ నాయకులు గాయత్రి కాలనీ రాజన్న కరియన్న మారుతి దళిత యువ నాయకుడు చిగనాగప్ప మాజీ సర్పంచ్ నందరాజనపల్లి నింగన్న పాల్గొన్నారు